ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అడ్డగుట్ట, నవంబర్ 30: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. నేడు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో దూద్‌బావి ప్రాథమిక పాఠశాలలో జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా కంటి, చెవి, ముక్కుతో పాటు ఇతర పరీక్షలను నిర్వహించి మందులను అందించడం జరుగుతుందని, ఈ వైద్య శిబిరం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

కంటోన్మెంట్ అభివృద్ధిపై నీలినీడలు

- మౌలిక వసతుల కల్పనలో బోర్డు విఫలం
- మూడున్నరేళ్లుగా ఎన్నికలు జరుపని రక్షణశాఖ
- ప్రజాప్రతినిధులు లేక పడకేసిన అభివృద్ధి
- విలీనంపై వీడని సందిగ్ధత..

ఎన్నికల నిర్వహణపై కోర్టుకెక్కనున్న బీఆర్ఎస్

కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్, నవంబర్ 30: నగరం నడిబొడ్డున ఉన్న కంటోన్మెంట్ పరిధిలో అభివృద్ధి నానాటికీ కుంటుపడుతోంది. బోర్డు పరిధిలోని ఆయా వార్డుల్లోని బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతులు లేక జనం అవస్థలు పడుతున్నారు. నాలుగేళ్లుగా జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ ప్రాంతం విలీనం చేయాలని కోరుతున్నా కేంద్ర రక్షణశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. మరోవైపు దాదాపు మూడున్నరేళ్లుగా బోర్డుకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం లేకపోవడం కారణంగా ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు పడకేశాయి. అధికారులు, నామినేటెడ్ సభ్యుడు నేతృత్వంలోనే కంటోన్మెంట్ పరిధిలో పాలన కొనసాగుతోంది. మరోవైపు నిధుల లేమితో బోర్డు సతమతమవుతుండగా, కేంద్రం నుంచి రావాల్సిన సర్వీస్ చార్జీల బకాయిలు నానాటికీ పేరుకుపోతున్నాయి. బోర్డుకు కేవలం పన్నులు, ఇతర చార్జీల రూపంలో వసూలయ్యే నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ప్రధానంగా తాగునీరు, వీధిదీపాలు, ఉద్యోగుల జీతభత్యాలకే సమకూరుతున్న నిధులు సరిపోతున్నాయి. కానీ అభివృద్ధి పనులకు నిధుల లేమి కారణంగా బోర్డు చేతులెత్తేస్తుంది.

ఆటకెక్కిన విలీన ప్రక్రియ..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం జరుగుతుందంటూ ఊదరగొట్టిన నేతలు ప్రస్తుతం మిన్నకుండిపోయారు. గత బీఆర్ఎస్ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనానికి ఎంతో కృషి చేశారు. కానీ కేంద్ర రక్షణశాఖ ఒక్క అడుగు ముందుకు నాలుగు వెనక్కి అన్నచందంగా విలీన ప్రక్రియ సాగింది. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీన ప్రక్రియ సజావుగా సాగితే మౌలిక వసతులు పెరుగుతాయని స్థానికులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఈ ఏడాది జులైలో విలీనానికి మార్గదర్శకాలు జారీ అయినా ప్రస్తుతం విలీన ప్రక్రియ మాత్రం ఆటకెక్కింది. రక్షణ శాఖ ఆధీనంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఏ అభివృద్ధి పనులు జరగాలన్నా అనుమతులు పొందాలంటే గగనం. ఈ ప్రాంతంలో ఓ భవనం నిర్మించాలంటే ఆ ప్రతిపాదనలను ముందుగా పుణెకు పంపితే అక్కడ పరిశీలించి ఢిల్లీకి పంపిస్తారు. దేశ రాజధాని ఢిల్లీలో అనుమతి వస్తేనే అభివృద్ధి పనులు జరుగుతాయి. ఈ క్రమంలో విలీనమే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావించినా విలీనంపై మాత్రం ఒక్క అడుగు ముందుకు పడడం లేదు. ఇదిలా ఉండగా విలీన ప్రక్రియ ఆటకెక్కినా, కనీసం ఎన్నికలు నిర్వహించకపోవడంతో కంటోన్మెంట్‌లో పరిస్థితి దారుణంగా తయారైంది.

ఎన్నికల నిర్వహణపై కోర్టుకు బీఆర్ఎస్..

విలీన ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో ఎన్నికలను నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. మూడున్నరేళ్లుగా ఎన్నికలు జరపకపోవడంతో బోర్డులో ప్రజాప్రతినిధులు లేని కారణంగా ఆయా బస్తీల్లో అభివృద్ధి పడకేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణశాఖ గెజిట్ విడుదల చేసి నెల తిరగక ముందే ఉపసంహరించుకుంది. నాటి నుంచి ఎన్నికలు లేకపోవడంతో బోర్డు పరిధిలో అభివృద్ధి పనులు జరగకపోవడం వల్ల స్థానికులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. నామినేటెడ్ సభ్యుడు ఉన్నప్పటికీ మౌలిక వసతుల కల్పనలో ముందడుగు వేయడం లేదు. ఆయా వార్డుల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు బోర్డు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణపై కోర్టుకు వెళ్లేందుకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో బోర్డు మాజీ సభ్యులు సిద్ధమయ్యారు. ఈనెల మొదటి వారంలో కోర్టులో పిటీషన్ వేసేందుకు రంగం సిద్ధం చేశారు. త్వరితగతిన బోర్డుకు ఎన్నికలు నిర్వహించేలా రక్షణశాఖకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరనున్నారు. ఎన్నికలు జరిగితేనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేస్తున్నారు.

పౌర హక్కులపై అవగాహన పెంచుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ అసిస్టెంట్ మోహన్

అడ్డగుట్ట, నవంబర్ 30: ప్రతి పౌరులు వారి హక్కులపై తప్పనిసరిగా అవగాహనను పెంచుకోవాలని మారేడ్‌పల్లి రెవెన్యూ మండల సీనియర్ అసిస్టెంట్ మోహన్ సూచించారు. శనివారం తుకారాంగేట్ గడ్డ మీది బస్తీలోని కమ్యూనిటీ హాల్‌లో ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రాజ్యాంగం ద్వారా సక్రమించిన హక్కుల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని ఆయన అన్నారు. ప్రతిపౌరుని జీవిత గమనం హక్కుల ఆధారంగానే ముందుకు సాగుతుందని, హక్కుల పట్ల పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బస్తీవాసులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేత

దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేస్తున్న లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 30: నిరుపేద దివ్యాంగులకు చేయూత ఇచ్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ సీఈఓ కౌముది అన్నారు. నగరంలోని వివిధ బస్తీల్లో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టామని ఆమె వివరించారు. శనివారం బన్సీలాల్‌పేట్‌లోని మురికివాడల్లో నివసించే ఐదుగురు దివ్యాంగులకు వీల్ చైర్లు సంస్థ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధులు వై.శ్రీనివాస్‌ముదిరాజ్ మాట్లాడుతూ దివ్యాంగులకు అండగా నిలిచిన లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. లబ్ధిదారుల తరపున వారికి ధన్యవాదాలు తెలిపారు. సభ్యులు అరుణ్, రాజేందర్, పద్మ, లావణ్య పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఫరీదా సుల్తానాకు కాంస్యం

అబిడ్స్, నవంబర్ 30 : సౌత్ఆఫ్రికాలోని డర్బన్‌లోని ఓలీవ్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన 11వ కామన్వెల్త్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఫరీదా సుల్తానా కాంస్య పతకం సాధించింది. కరాటే ఇండియా అధ్యక్షుడు హంషి భరత్‌శర్మ, కరాటే డో అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తదితరులు ఈ సందర్భంగా ఫరీదా సుల్తానాను ప్రశంసించారు. మరిన్ని పతకాలు సాధించాలని అభిలషించారు.

సంస్కృతభాష అన్ని భాషలకు మూలం

- పద్మశ్రీ త్రిపురనేని హనుమాన్ చౌదరి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 30: సంస్కృత భాషే అన్ని భాషలకు మూలమని పద్మశ్రీ త్రిపురనేని హనుమాన్ చౌదరి అన్నారు. సంస్కృతంలో ఎన్నో శాస్త్రాలు ఉన్నాయని చెప్పారు. నేటి సమాజానికి ఉపయోగపడే విషయాలను పరిశోధించి సమాజానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఓయూలోని సంస్కృత అకాడమీలో 'సంస్కృత సాహిత్యంలో వార్త (వ్యవసాయం, పశుపాలన, వాణిజ్యం) యొక్క ప్రాశస్త్యం-ఆధునిక సమాజంలో దాని ఉపయోగం' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా చౌదరి హాజరై మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న శాస్త్రాలు చాలా గొప్పవని, అందులోని విషయాలు అన్ని కాలాలకు వర్తిస్తాయని అన్నారు. ఆ విషయాలను నేటి సమాజానికి అందించేందుకు పండితులు కృషి చేయాలన్నారు. అకాడమీ డైరెక్టర్, ప్రొఫెసర్ పెన్నా మధుసూదన్ మాట్లాడుతూ సదస్సు లక్ష్యాలను వివరించారు. ప్రస్తుతం దేశంలో నడుస్తున్న విజ్ఞాన సంస్థల తీరుతెన్నులను వివరించారు. సంస్కృత భాషలో ఉన్న శాస్త్రాలపై పరిశోధనలు చేసి భావితరాలకు అందించేందుకు తగిన ప్రణాళికలతో వస్తే అకాడమీ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఋగ్వేద పండితుడు, తెలంగాణ సంస్కృత భారతి అధ్యక్షుడు ప్రొ.నరేంద్రకాప్రే, ఇండిక్ అకాడమీ అధ్యక్షుడు ప్రొ.పాతూరి నాగరాజు, శ్రవణ్‌కుమార్, అకాడమీ మాజీ డైరెక్టర్ ప్రొ.నీలకంఠం, సదస్సు డైరెక్టర్ సంతోష్‌కుమార్ జోషి, ప్రొ.శశిరేఖ, సంస్కృత భారతి ఉపాధ్యక్షుడు లక్ష్మినాథాచార్యులు, ప్రొ.విద్యానంద ఆర్య, సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి, సూర్యప్రకాశ్, మంజీర, వీరభద్రశర్మ, భరద్వాజ్, చంద్రశేఖర్, రాము, రేణుక, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన అతిథులు, నిర్వాహకులు

బేగంపేట్‌లో సందడిగా కేక్ మిక్సింగ్



బేగంపేట్‌లోని కాలేజీలో నిర్వహించిన కేక్ మిక్సింగ్ వేడుకలు

బేగంపేట్, నవంబర్ 30: బేగంపేట్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్-శ్రీశక్తి కళాశాలలో క్రిస్మస్ ఫ్రూట్ కేక్ మిక్సింగ్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల ఎండు ఫలాలు, పండ్ల రసాలు, సుగంధద్రవ్యాలు, విలువైన మద్యంతో కలిసి కేక్ మిక్సింగ్ చేసి నిల్వ చేశారు. నటుడు యశ్‌పూరి, పాడుతాతీయగా సీజన్ 15 విన్నర్ మాస్టర్ దొంతుశెట్టి ధీరజ్ హాజరై కేక్ మిక్సింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపింజల, డైరెక్టర్ యమునా రంగారావు, మార్కెటింగ్ డైరెక్టర్ రవి పింజల, ప్రిన్సిపాల్ అనితాచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

అన్నదాన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, సభ్యులు

చిక్కడపల్లి, నవంబర్ 30: చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయం సమీపంలో అన్నదాన నిర్వహించారు. అన్నదాత పొద్దుటూరి నర్సింహ రావు, (మద్దుల మధురిదేవి జ్ఞాపకార్థం) సహదాత మద్దుల రామవెంకట సుబ్రహ్మణ్యం బ్రదర్స్ సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చూపూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేశ, కోశాధికారి తొడుపునూరి రవి, మాజీ అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్తా, సంఘం సభ్యులు రాజేశ్వర్‌రావు, రాజురి బాలచందర్, సింగారపు శంకర్, సురేందర్‌గుప్తా, ప్రసాద్, రాజయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

హోలీ ఫ్యామిలీ చర్చిలో క్వాయర్ వేడుకలు

బొల్లారం, నవంబర్ 30: కంటోన్మెంట్ ఏడో వార్డు లాల్‌బజార్ హోలీ ఫ్యామిలీ చర్చిలో 35వ క్వాయర్ ఫెస్టివల్ వేడుకలు శనివారం తిరుమలగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, చర్చి ఫాదర్ మారెడ్డితో కలిసి ప్రారంభించారు. హోలీ ఫ్యామిలీ, సెయింట్ జోసఫ్ పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం వేడుకలు నిర్వహిస్తున్నట్టు, విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ జోసఫ్ పాఠశాల సిబ్బంది, ఎస్సై రాజశేఖర్‌రెడ్డి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో ఉచిత వైద్య శిబిరం

కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొల్లారం, నవంబర్ 30: కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి బంజారా నగర్, ఐఓబీకాలనీలో తిరుమలగిరి సన్‌మేడ్ దవాఖాన ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి వైవీ రావు, కాలనీవాసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల విషయంలో అండగా ఉంటాం

సనత్‌నగర్, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముఠా గోపాల్

బాధిత కుటుంబ సభ్యులకు ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

బేగంపేట్, నవంబర్ 30: పేద ప్రజలకు వైద్య సేవల విషయంలో అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో బన్సీలాల్‌పేట్‌కు చెందిన ఆసియా బేగం వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయ పత్రాన్ని (ఎల్వోసీ) ఆసియాబేగం భర్త వసీంకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పేద, ధనిక తేడా లేకుండా ఆరోగ్యపరమైన సమస్యలు వస్తుంటాయని, నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మిపతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గాంధీనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. 14 మంది లబ్ధిదారుకుల రూ.6,50,000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గాంధీనగర్, ముషీరాబాద్, కవాడిగూడ డివిజన్ల అధ్యక్షులు రాకేశ్‌కుమార్, కొండ శ్రీధర్ రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, కడుప సరేందర్, సాయికుమార్, మాధవ్, శ్యాంసుందర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, చిట్టి, వాల్లాల రవి, కిరణ్ కుమార్, టిల్లు,బాసం శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రైలు ఢీకొని ఇద్దరు మృతి

కాచిగూడ, నవంబర్ 30 : వేర్వేరు చోట్ల రైలు ఢీకొని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతిచెందారు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి(55) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు గోధుమ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, 5.5 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..

పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గుర్తు తెలియని వృద్ధుడు(65) శనివారం ఉప్పుగూడ-యాకుత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృత దేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు ఉస్మాని యా దవాఖానకు తరలించారు. మృతుడు ఆకుపచ్చ రంగు చొక్కా, తెల్ల ధోవతి ధరించి, 5.2 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9948695948 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కమ్మ ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కమ్మ సేవా సమితి ప్రతినిధి

అమీర్‌పేట్, నవంబర్ 30: ఎస్ఆర్‌నగర్ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాలులో శనివారం కమ్మ వారి ఆత్మీయ సమ్మేళనం, కార్తిక వన భోజనాలు జరిగాయి. సేవా సమితి ప్రతినిధులు సూర్నేని మోహన్‌నాయుడు, యలమంచి రాజారావు, మొక్కపాటి రాఘవమురళి, అనిల్ నేతృత్వంలో జరిగిన వేడుకల్లో కమ్మ సామాజిక ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, అమీర్‌పేట్ కార్పొరేటర్ కేతినేని సరళ, బీజేపీ నాయకురాలు పద్మ వీరపనేని తదితరులు పాల్గొన్నారు. గోమాత పూజతో వేడుకలు ప్రారంభమైన కార్యక్రమంలో పక్తలు మాట్లాడుతూ కమ్మ సామాజిక దృక్పథాన్ని, సేవా నిరతిని వివరించారు. కార్యక్రమానికి ఎస్ఆర్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కమ్మ సంఘం ప్రతినిధులు అశేషంగా తరలివచ్చారు.

గుడిమల్కాపూర్ మార్కెట్‌లో ఎమ్మెల్యేల పర్యటన

మెహిదీపట్నం: నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ ఇందిరాగాంధీ పూలమార్కెట్‌లో శనివారం కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్‌మొహినుద్దీన్, మాజీద్ హుస్సేన్ పర్యటించారు. పూలమార్కెట్‌లో గతంలో కూల్చిన దుకాణాల స్థానంలో తిరిగి దుకాణాలను ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యేలు చిరు వ్యాపారులతో చర్చించారు. దుకాణాలను కోల్పోయిన వారు కోర్టు నుంచి నాట్ టు ఎంటర్ ఫేర్ ఆర్డర్ తెచ్చుకొని దుకాణాలను పెట్టుకున్నారు. వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయొద్దని పోలీసులు, మార్కెట్ అధికారులకు సూచించారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి, నవంబర్ 30: సిల్వెల్ కార్పొరేషన్ గంగోత్రి కల్చరల్ ఫౌండేషన్, ప్రాజ్ఞిక ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన సినీ సంగీత విభావరి కార్యక్రమం ఆకట్టుకుంది. గీతాలాపన చేసిన గాయకులందరిని విశిష్ట అతిథులుగా విచ్చేసిన ప్రవీణ్ పారిజాత అభినందించారు. సీల్వెల్ బండారు సుబ్బారావు, సంస్థ కార్యదర్శి గంగోత్రి దేవాన్షి, ఉపాధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఆలపిస్తున్న గాయకులు

ప్రతిభను నిరూపించడానికి క్రీడలు దోహదం

అంబర్‌పేట, నవంబర్ 30 : క్రీడలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య సూచించారు. డీడీ కాలనీ, నల్లకుంట, గాంధీనగర్, హిమాయత్‌నగర్ బ్రాంచీల బచ్‌పన్ స్కూల్స్ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ డీసీపీ నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే చదువుకు సార్థకత ఏర్పడుతుందని సూచించారు. శారీరక దృఢత్వాన్ని పెంచడానికి క్రీడలు మరింత ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి, కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, ఆర్.యామిని తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

కాచిగూడ, నవంబర్ 30: ఫంక్షన్‌కు వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘట న కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై పి. రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ దారుషఫా ప్రాంతానికి చెందిన ఎం. రవళి (26)శుక్రవారం చెప్పల్‌బజార్‌లో ఉండే స్నేహితురాలి ఇంటికి ఫం క్షన్‌కు వెళ్లి ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో కల తచెందిన భర్త సాయివికాస్ శనివారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రవళి లేత పింక్ కుర్తా పైజమా, నీలి రంగు చున్నీ ధరించి, 5.3 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసిఫ్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

మెహిదీపట్నం: ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో శనివారం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ పర్యటించారు. సందర్భంగా చోటిమసీద్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్‌ను ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.